


# ఆటోగ్రాఫ్

పి. శైలజ

ఉమెన్స్ కాలేజీ అప్పుడే వదిలారు. అంతకు ముందు పది నిముషాల నుంచి కల్పనలో ఆరాటం. బెల్ కొట్టగానే గబగబా పుస్తకాలు సర్దుకుని ప్రాణస్నేహితురాలు మాలినితో "ఇక వెళతానే" అని చెప్పి బయలుదేరింది.

కల్పనను చూసి చిన్నగా నిట్టూర్చింది మాలిని. మాలిని, కల్పన ఇద్దరూ డిగ్రీ ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్. ప్రాణస్నేహితురాళ్ళయినా స్థితిగతుల్లో ఎంతో భేదం. మాలిని లక్షాధికార్ల ఏకైక పుత్రిక. కల్పన మామూలు మధ్య తరగతి కుటుంబంలో నలుగురు పిల్లల్లో ఒక్కతి. కల్పన చాలా అందంగా ఉంటుంది. కల్పన ఇల్లు కాలేజీకి దగ్గరే అయినందువల్ల నడిచివెళ్ళి నడిచి వస్తుంది. మాలిని కార్లో వస్తుంది. కల్పనను ఆ దారిలో ఎప్పుడూ డ్రాప్ చేస్తుంది మాలిని. కానీ పదిహేను రోజుల నుంచి కల్పన ధోరణి మారింది.

పదిహేను రోజుల క్రితం యద్దనపూడి హీరోలాంటి అందమైన అబ్బాయి మోటార్ బైక్ మీద ఆ దారిన వెళుతుండగా చూసింది కల్పన. చూడగానే కన్నెమనను చలించింది. చిన్నప్పుడు చందమామ కథల్లో చదువుకున్న రాకుమారుడు, పెద్దయ్యాక చదివిన తెలుగు, ఇంగ్లీషు నవల్లోని హీరోలను గుర్తుకు తెచ్చాడు అతను. అతనూ కల్పన అందాన్ని చూసి మెచ్చుకోలుగా కళ్ళతోనే నవ్వుతాడు. అతన్ని చూడాలని ఒక్కతే నడిచి వెళ్ళడం అలవాటు చేసుకుంది. ఆ వయసులో అదో క్రేజ్. యౌవన సహజమైన ఆనందం. అతన్ని చూస్తే చాలు–కల్పనలో ఏదో అనుభూతి.

మాలిని స్నేహితురాలి విషయం విని మందలించింది. "కథల్లో రాసినట్లు అవన్నీ ఊహలు. ఈ కాలంలో హీరోల్లాంటి అబ్బాయిలు కూడా డబ్బుకే ప్రాముఖ్యా న్నిస్తారు. ఊహలు అందంగానే ఉంటాయి. వాస్తవంలో అలా జరగదు" అని వాదించింది.

"నా ఊహలే నాకు ఆనందం. ఈ వయసులో ఏ ఆడపిల్ల మనసులో అయినా ఏ పురుషుడైనా కథల్లోలా నన్ను ఆరాధిస్తే అన్న ఊహ కలగక మానదు. నేను ధైర్యంగా చెబుతున్నాను. కొందరు చెప్పలేరు. అతను నాకు ఏమీ కానవసరంలేదు. కథల్లోలా నన్ను పెళ్ళి చేసుకుంటాడని ఆశించడంలేదు. అతన్ని చూడడంలో ఏదో థ్రిల్‌ను అనుభవిస్తూ కాసేపయినా మధ్య తరగతి జీవితాన్ని మరచిపోతాను" అనేది కల్పన.

మధ్య తరగతి వాళ్ళకే కలలు ఎక్కువేమో అనుకుంది మాలిని. అతన్ని చూడాలని ఎన్నోసార్లు ప్రయత్నించింది కానీ కొద్దిలో అలాంటి ఛాన్సులు మిస్సయ్యేవి. కల్పన అతన్ని అక్కడక్కడ చూడటం, అతను కూడా కల్పనను చూడగానే గుర్తించేవాడు. అతని కళ్ళలో కల్పన అందాన్ని గురించిన ప్రశంస.

"నా హీరో అక్కడ కనిపించాడు. ఇవాళ సినిమాలో కనిపించాడు. మా పక్క ఇంటి వాళ్ళతో బాగా పరిచయం ఉందేమో అతను అప్పుడప్పుడు మా పక్క ఇంటికి వస్తూ ఉంటాడు" అని చెప్పేది కల్పన. అతని పేరు తెలియనందువల్ల అతను హీరో హొండా మీద తిరుగుతాడు కాబట్టి 'హీరో హొండా' అని పేరు పెట్టింది కల్పన.

ఒక రోజు తన ఆటోగ్రాఫ్ తెచ్చి మాలినికి చూపిస్తూ "హీరో హొండా పేరు తెలిసిందోయ్ మాలినీ. అతని పేరు మిత్రా అట. మా పక్కింటి అమ్మాయి చేత నా ఆటోగ్రాఫ్ ఇచ్చి ఆ అమ్మాయి చేత అడిగించి, ఆ అమ్మాయి కోరినట్లుగా సంతకం చేయించుకున్నాను. కానీ నేను అతనికి తెలియదు" అంది అతని సంతకం చూసి మురిసిపోతూ !

కల్పన పిచ్చికి నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు మాలినికి.

హఠాత్తుగా మాలిని పెళ్ళి కుదిరింది. పరీక్షలయ్యాక పెళ్ళి పెట్టుకున్నారు. ఆ ఊళ్ళోనే పెద్ద బిజినెస్ మాగ్నెట్ కొడుకు. ఎమ్.ఏ. చేశాడు. పేరు అశోక్. అతనూ బిజినెస్ చూసుకుంటున్నాడు. ఎంగేజ్‌మెంట్ ముందు అతని ఫోటో తెచ్చి కల్పనకు చూపింది మాలిని. ఫోటో చూడగానే అదోలా అయిపోయింది కల్పన.

కొద్ది రోజులుగా కల్పన హీరోను తలవడం మానేసింది. అతనికోసం వెళ్ళడం లేదు.

"ఎందుకే కల్పనా, ఈమధ్య నీ హీరో కోసం వెళ్ళడంలేదు? అతను మాయమయ్యాడా? ఈసారి కనిపిస్తే నీ ఆరాధకురాలిని అని చెప్పవే" అంటూ హాస్యమాడింది మాలిని.

"ఆడపిల్ల లందరికీ ఆశలు ఉంటాయి. కానీ నేను మధ్య తరగతి ఆడపిల్లను. అతని ఎత్తుకు ఎదగడానికి అందరికీ అదృష్టం ఉండదుగా? అందం తప్ప డబ్బు, ఇతర హంగులు లేని సామాన్యురాలిని నేను. అతను అందరాని చందమామ." విరక్తిగా అంది.

పరీక్షలవగానే మాలిని పెళ్ళయిపోయింది. పది రోజులు కొత్త దంపతులు హనీమూన్ వెళ్ళివచ్చారు. ఆ మరునాడు వారి ప్రయాణం. విజయవాడలో వాళ్ళ బ్రాంచి ఆఫీసును చూసుకోవడానికి అశోక్‌ను పంపుతున్నారు. అతనితో పాటే మాలినిని అన్ని హంగులతో కొత్త కాపురానికి పంపుతున్నారు.

ఆ రోజు కల్పన వచ్చి స్నేహితురాలి గుర్తుగా ఏదైనా రాయమంటూ ఆటోగ్రాఫ్ ఇచ్చింది. బట్టలు, వస్తువులు సర్దుకుంటూ ఆటోగ్రాఫ్ రాయడానికి తీరికలేని మాలిని రాత్రి గుర్తుకు వచ్చి, ఆటోగ్రాఫ్ తీసుకుని ఏం రాయాలి అని ఆలోచిస్తుండగా అశోక్ "దేవిగారు ఏం చేస్తున్నారు?" అంటూ వచ్చాడు.

"ఓ... ఆటోగ్రాఫ్ రాస్తున్నావా? ఈ సమయంలో నాకంటే మీ ఫ్రెండ్ ముఖ్యమా రేపు రాయకూడదూ?" అంటూ ఆమె చేతిలోని ఆటోగ్రాఫ్ తీసుకున్నాడు.

"కల్పన నా బెస్ట్ ఫ్రెండ్" అంది మాలిని.

"అలాగా?" కల్పన మొహం అతని కళ్ళముందు మెదిలింది. పెళ్ళి కాకపూర్వం ఆ అమ్మాయి అక్కడక్కడ కనిపించి మెరుపుతీగలా మాయమయ్యేది. ఆటోగ్రాఫ్ పేజీలు తిప్పుతూ, "మాలీ, ఈ ఊళ్ళో ఎంతోమంది అమ్మాయిలకు నేనంటే క్రేజ్. నా పరిచయం కోసం చాలామంది ఆరాటపడేవాళ్ళు. కానీ లవ్‌ఎఫైర్స్ మీద నాకు నమ్మకం లేదు. పెళ్ళి చూపుల్లో నిన్ను చూడగానే ఐ లైక్డ్ యూ. అందుకే నిన్ను చేసుకున్నాను" అంటూ హఠాత్తుగా ఆగిపోయి ఆటోగ్రాఫ్‌లోని ఒక పేజీవైపు చూస్తూ "ఇదెలా సాధ్యం? నా సంతకం మీ ఫ్రెండ్ ఆటోగ్రాఫ్‌లోకి ఎలా వచ్చింది?" ఆశ్చర్యంగా, తెల్లబోతూ అడిగాడు.

చటుక్కుని చూసింది. అది 'హీరో హొండా' 'మిత్రా' చేసిన సంకతం. అర్థం కానట్లుగా "ఇది... ఇది... మిత్రా... మిత్రా సంతకం. మీదెలా అయ్యింది?" అనడిగింది.

"ఆ, నా పేరు అశోక్‌మిత్రా. ఇంట్లో అందరూ అశోక్ అంటారు. ఫ్రెండ్స్ అందరూ 'మిత్రా' అంటారు. మిత్రా అనే సంతకం చేస్తాను. రిజిస్టర్స్‌లో అశోక్ అని ఉంది కాబట్టి అశోక్ అనే చెప్పారు మా వాళ్ళు. నా పూర్తి పేరు చెప్పలేదు మీకు. ఇంతకూ ఈ ఆటోగ్రాఫ్‌లోకి నా సంతకం ఎలా వచ్చిందబ్బా?"

అతను ఏం చెప్పేదీ తరువాత వినిపించలేదు మాలినికి. సర్వం అర్థమైపోయింది.

మిత్రా కల్పన ఆరాధకుడు. కల్పనే కాదు చాలామంది ఆడపిల్లల హీరో తన భర్త. ఫోటో చూడగానే కల్పన ఎందుకలా అయిపోయిందో, తన పెళ్ళి కుదిరాక మిత్రా పేరు తలవడం ఎందుకు మానేసిందో తను అప్పుడు అంతగా గుర్తించలేదు. కానీ ఇప్పుడు అర్థమవుతోంది. నిజమే. ఎంతోమంది ఆడపిల్లలు అతన్ని ఇష్టపడినా తననే ఎందుకు చేసుకున్నాడు? అతను తనకంటే అందగాడు. తనకంటే అందమైన ఆడపిల్లలను కాదని తన నెందుకు చేసుకున్నాడంటే... ఒకే కులం, బోలెడు ఆస్తి. అలాంటి తనను వదులుకుని కల్పనలాంటి గడ్డిపువ్వులను ప్రేమించడానికి మిత్రా పూర్వకాలపు అబ్బాయి కాదుగా? ఈ కాలపు అబ్బాయి. డబ్బు విలువ తెలుసు. అందుకే అందరినీ తప్పించుకుని అన్ని హంగులూ ఉన్న తన మెడలోనే మూడు ముళ్ళూ వేశాడు.

"పిచ్చి ఆడపిల్లలూ ! జాగ్రత్తగా ఉండండి. అందమైన హీరో కనిపించగానే కథల్లోలా జరుగుతుందని మనసు పారేసుకోకండి."

మిత్రా ఆటోగ్రాఫ్ టేబుల్ మీద పడేసి మాలినిని దగ్గరకు తీసుకుని తన చెవి దగ్గర గునగునగా మత్తుగా అంటున్న మాటలు వినిపించలేదు మాలినికి.

ఆమె కళ్ళముందు మధ్య తరగతి ఆడపిల్లల విరిగిన కలలకు ప్రతినిధిలా విరక్తిగా ఉన్న కల్పన మొహం కదలాడింది.

*

---

నిరాశ కొండ చిలువై
నా మీద కొచ్చి నవ్వుడల్లా
నేను చెట్టై పోతాను.

అరగించిన వైఫల్యాల్ని
అరిగించుకోడానికి
కొండ చిలువ నన్ను
చుట్టుకు పోతుంది.

నా చుట్టూ ముళ్ళ బాకులను
కసితో మొలిపించుకుంటాను
కడుపులోని వైఫల్యాలతో పాటు
కొండ చిలువ ముక్కలై పోతుంది.

ఆ వెంటనే నేను
రూపాంతరం చెంది
మనిషిగా మెరిసి పోతాను. - కె.వి.యస్.వర్మ

